# "ఆవు - పులి"

'ఆవు-పులి' కథని యజమాని కొడుకు ఎంకడు చదువుతుండగా, ఆరోజు పెందలాడే గోవు విన్నది. విన్న దగ్గర్నుంచి దాని మనసంతా పాఠంపైకే మళ్లిపోయింది. అందుకే పొలంలో వున్నా ఆ పాఠాన్ని గురించే ఆలోచిస్తూ వుంది. దాని ఏడు ఈతల అనుభవం మరెన్నో ప్రశ్నల్ని వేస్తోంది.

ఆవు వుండేదట. మంచిదట. పైగా సాధువుగా జీవించేదట! 'మరి ఆవు సాధుజంతువయినప్పుడు దానికి రెండు కొమ్ములెందుకు? దొరికిన మేతతో తృప్తిపడేదిట. మళ్ళీ యజమానికి కుండలకొద్ది పాలిచ్చేదట! కుండలకొద్దీపాలివ్వాలంటే దొరికిన మేతతో తృప్తిపడితే సాధ్యమా...?'

ఇవన్నీ ఎలావున్నా ఆవు నిజాయితీకి పులి తినకుండా విడిచిపెట్టడం?... పోనీ విడిచిపెట్టినా ఆదఫాకే...! మళ్ళీ దఫాకేం చేస్తుంది? గుటుక్కున మింగెయ్యదూ? మింగెయ్యకుండా ఆ ఆవుని వదిలివేసినాసరేగాని పులి సాధుజంతువుగా మారుతుందా? అసలు ఆవుల్నే తినకుండా వుంటుందా?...' ఇలా ఆలోచిస్తూ వున్న గోవుకు మందను దాటి నిజంగానే అడవిని చేరుకున్నట్టు అప్పటికి అర్థమయ్యింది.

ఇంతలో ఎదురుగా పులి!

కథలో లానే కళ్ళెదుట నిలబడి వుంది. గోవు పాతకథలోల బెదరకుండా వుండలేకపోయింది. పులికి కూడా ఆశ్చర్యం వేయలేదు. అందుకనే అమాంతం గోవుమీద పడబోయింది. గోవుకు ఏం చేయాలో తోచక, మాటరాకపోయినా పాత కథని గుర్తు చేసుకొని 'నన్ను ఒక్కమాట కాస్త చెప్పనివ్వు' అంది.

పులికికూడా పాతకథ గుర్తుకొచ్చిందేమో గోవుమీదికి దూకకుండా ఆగి వినసాగింది. ఆవు చెప్పింది.

''ఓ పులిరాజా! ఇంటి దగ్గర నాకొక కోడెదూడ వున్నది. పుట్టింకా ఏడెనిమిది నెలలయినా కాలేదు. పచ్చిక తినడం వచ్చినా దానికింకా పాలపైన ఆపేక్ష పోలేదు. ఎందుకంటే యజమాని యిప్పటికీ సేపుకోసమని గుక్కెడు గీరుకోనిచ్చి, లాగి కట్టేస్తాడు. ఇవాళ అదికూడా మందలోకి వచ్చింది. ఒకసారి నేవెళ్ళి నా కొడుక్కి కడుపారా పాలు యిచ్చి తిరిగి వస్తాను. ఆ తరువాత నన్ను భక్షించవచ్చు''.

పులి ఎందుకో ఎగతాళిగా నవ్వలేదు. ఏదో ఆలోచించుకొని ''మరి నీవు వస్తావుకాని నీ యజమాని నిన్ను వదులుతాడా? చెప్తే వదలడు. చెప్పకపోతే ధర్మనిష్ఠ తప్పినదానివవుతావు. రాకపోతే సత్యనిష్ఠ తప్పినదానివవుతావు. సత్యమో ధర్మమో ఏదో ఒకటి తేల్చుకో' అనను. నేను నిన్ను తినాలనుకుంటున్నాను, కాబట్టి నువ్వు తిరిగి రావాలి. అంచేత నువ్వు నీ గోవు చరిత్రను మలినం చేసి మాటతప్పి వుండిపోకు సుమా! నేనసలే ఆకలితో వున్నాను. మా తాతగారి పెదఖర్మరోజు కాబట్టి ఆయన్ని తలచుకొని... ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని... ఆయనలా విడిచిపెట్టేడని నాకిష్టం లేకపోయినా రివాజుకోసం విడిచిపెడుతున్నాను. వెళ్లి వేగరం వచ్చెయ్యి సుమా, నేను ఉపవాసంతో వున్నా గదా, నీవు రాగానే పుణ్యలోకానికి నిన్ను పంపుతాను'' అన్నది.

గోవుకి ధర్మం నాలుగుపాదాలా నడుస్తున్నట్టే తోచింది. తన పాదాలవంక ఓమారు చూసుకుంది. ఓ పాదం ఆనితే మరొకటి ఆనడంలేదు!

గోవు వణుకుతూ పరుగుతీసింది. మందని సమీపించింది. మందకు తూర్పు దిక్కున దాని కడుపున పుట్టిన దూడ అగుపించింది. పరుగు పరుగున వెళ్లింది. కోడెదూడ పరుగున వెళ్లి తల్లి రొమ్మున గుద్దలేదు. పాలు తాగాలని ప్రయత్నించలేదు. తన తల్లి వట్టిపోయింది కాబట్టే తననీ మందలోకి పంపిందని ఆ కోడెదూడకు తెలుసు. తెలిసిన విషయం గూర్చి తల్లీ బిడ్డా మాట్లాడుకోలేదు.

గోవు దూడను నాలుకతో నాకింది. కితకితలు వేసిన కోడెదూడ మరీ చిన్నదాన్లా అటూ ఇటూ పరుగులెత్తి గెంతింది. మిగతా దూడలూ వచ్చి చేరాయి. వచ్చీరాని కొమ్ములతో ఆకతాయిగా గుచ్చుకుంటూ రంకెలు వేసాయి.

గోవు మాత్రం అలానే నిలబడిపోయింది. అంతకుమించి పెద్ద ఆలోచనలో పడిపోయింది. 'వేదాలూ శాస్త్రాల్లోవున్న నీతే నీతి! ఎందుకూ ఏమిటి ప్రశ్నించే అధికారం లేదు. అందుకే నీతి మారలేదు. కథ మారలేదు. పులి తినడమే ధర్మం. గోవు బలికావడమే ధర్మం. నేనేమిటి యిలా ఆలోచిస్తున్నాను? నా నాయినమ్మ యిలా యిన్ని ప్రశ్నలు వేసుకుందా? బుద్ధిగా వెళ్లి పులికి తన నిజాయితీ నిరూపించుకోలేదూ? నా ఏడీతల అనుభవం ఇన్ని ఆలోచనలకు గురిచేసినా, నేను ఆ సాంప్రదాయాన్ని నిలబెడతాను. తప్పదు' అని గోవు తీర్మానించుకుంది. కళ్ళని రెప్పలతో టపాటపా లాడించి దుఃఖం తుడుచుకోబోయింది.

కోడెదూడ ఇదంతా గమనించి ఏమిటి అని అడిగింది. మిగతా కోడెలు చెప్పమని పట్టుబట్టాయి.

గోవుకు చెప్పక తప్పిందికాదు. చెప్పి బయలుదేరబోయింది. కోడెలన్నీ అడ్డుకున్నాయి.

మరెనిమిది దూడలతో దాని బిడ్డ అయిన కోడెదూడ కలసి తొమ్మిదున్నూ, తూర్పునుంచి ఉత్తరానికి ఊరిని దాటి అడవిలోకి వెళ్లాయి... వాటి దండును చూస్తే దళమేదో కదుల్తున్నట్టు వుంది.

''ఏ నాయనమ్మ ఏ పూర్వకథలో బతికిందో గాని యిపుడు నాయినమ్మా, అమ్మమ్మా, అమ్మా అందరూ అలాగే బతికిపోలేదు. బతుకుపోరు అయిందిప్పుడు. నీతి కథలు విని బలయిపోవడానికి మనం మూడో తరగతి పిల్లలంకాదు. మూర్ఖపు మనుషులమూ కాదు...'' అంటూ తీర్మానించుకున్నాయి.

అప్పటికే పొద్దు దిగింది.

సూర్యుడు ఎరుపుదనం అడవి ఆకుల్లోంచి చొరబడి మంట పెట్టినట్లు వింత కాంతితో వుంది. ఆ కాంతి దూడల దండు పై బడి ఎఱ్ఱదనంతో ఎఱ్ఱచీమల దండులా వుంది.

పులి ఇంకా చెట్టు మొదట్నే కూర్చొని వుంది. చరిత్ర ఎప్పుడూ ఒకేలా వుంటుందని నిశ్చలంగా వుంది కాబట్టే అంత ఆకలితో ఆవురావురుమంటూ కూర్చొంది. విసుక్కుంటూనే ఎదురు చూస్తోంది. కూటి రెప్ప ఎత్తిదించేసరికే తొమ్మిది దూడలూ ఒకేసారి పులిపై పడ్డాయి. వచ్చీరాని కొమ్ములతో కుళ్లబొడిచాయి. గట్టిపడి అప్పుడే ఉక్కుబారుతున్న డెక్కలతో మీదపడ్డాయి. పులి తేరుకొనేలోపే పొట్టలో లేతకొమ్ములు వాడిగా దిగబడ్డాయి. ప్రేవుల్ని తెంపాయి. పులి నీరసంతో వున్నా ఆవేశంతో దొరికనవాటిని అందుకోబోయింది. ఒక దూడ ఒక పంజా దెబ్బకే పడిపోయి గిలగిలా కొట్టుకుంటూ నేలకు వాలిపోయింది. మరో దూడ నోటికందిపోయి విలావిలా ప్రాణాలు వదిలి సోలి పోయింది. అది చూసి మిగతావి ఆగిపోలేదు. తమ శక్తి మేరకు ఆగకుండా పొడుస్తూనే వున్నాయి. పులి ప్రేవుల్ని మరోదూడ తన కాలి డెక్కలతో దువ్వి లాగిపారేసింది. పులి తన నోట వున్నదాన్ని వదలి మరోదాని మెడ అందుకుంది. మిగతావి అన్ని వేపులనుంచి దొరికిన చోటల్లా పొడిచి పొడిచి వదిలాయి. మరో రెండు... మొత్తం నాలుగు దూడలు చచ్చిపోయాయి. మిగతా ఐదు దూడలకి కాళ్లూ... కన్నులూ పోయాయి. మొత్తానికి పులి చచ్చిపోయింది.

కన్నపేగు తెగిపోయిన అంత దుఃఖంలోనూ... బతుకుమీద భయం పోగొట్టిన దూడల్ని తలుచుకొని, తృప్తిగా నిట్టూర్చి, ఇకముందూ ఈ కొత్త కథే పుట్టబోయే వాటికి చెప్పాలనుకుంది గోవు.

★ ★ ★

*(సైన్స్ విషయంలో మార్పుని గమనిస్తూ పాఠ్యాంశాల్లో మార్పు లొస్తున్నా, నీతి విషయంలో శాస్త్రీయమైన పరిణామాన్ని గర్తించని పాత అంశాలే పాఠ్యాంశాలు కావడాన్ని నిరసిస్తూ కథ రాయమని కోరిన 'గుల్లి పల్లి మధు'కి ప్రేమతో-)*

*ప్రచురణ : ఉపాధ్యాయ, సెప్టెంబరు - 1994*

***రచనా కాలం** : 18 ఆగస్టు, 1994*